క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ తీరు పరిశీలన



ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసిన పాఠ్యపుస్తకాల వివరాలను ఎంఈవో పరిశీలించారు. బడులకు సరిపడా వచ్చాయా, లేదా? అని తెలుసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రత్తిపాడు ఎంఈవో సీహెచ్ రమాదేవి పెదనందిపాడు మండలంలోని పెదనందిపాడు హైస్కూల్, గొరిజవోలు గుంటపాలెం, అబ్బినేని గుంటపాలెం, గోగులమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందించే లక్ష్యంతో ఉన్నామని ఎంఈవో వివరించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్



చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బాలికను హత్య చేసిన నిందితుడిని వెంటనే శిక్షించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం రాత్రి క్యాండిల్ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ డిమాండ్ చేశారు. ఇంతవరకు నిందితుడిని పట్టుకోకపోవటంపై అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి పరిహారంగా రూ.పది లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను, శశి, అరవింద్, మణికంత, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో కేంద్ర బృందం పర్యటన



పెదకాకాని: పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ కేంద్ర పరిశీలన బృంద సభ్యులు ఎస్. జయకుమారి తదితరులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు, నీటి నాణ్యత, సరఫరా తీరు పరిశీలించారు. జడ్పీ హైస్కూల్, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించారు. నాణ్యమైన నీటిని కాచి వడపోసి తాగడం శ్రేయస్కరమని ప్రజలకు సూచించారు.ఇంజినీరింగ్ అసిస్టెంట్ అరుణ, వెస్లీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.నాగేశ్వరరావు, వి. మోహనకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బీటెక్ డిగ్రీల ప్రదానోత్సవం

గుంటూరు రూరల్: నాణ్యమైన విద్యను ప్రతి విద్యార్థికి అందించడమే తమ లక్ష్యమని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో మొదటిసారిగా స్వయంప్రతిపత్తి హోదాలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా విధానం తమ కళాశాల ప్రత్యేకత అని తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ బి. బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం 700 మందికి పట్టాలను ప్రదానం చేశారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన 11 సంవత్సరాలలో ఎన్‌బీఏ, నాక్ ఏ గ్రేడ్, స్వయం ప్రతిపత్తిని సాధించడంతోపాటు ఈ పట్టా ప్రదానోత్సవం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. వ్యక్తిగత ఉన్నతితో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. విద్యార్థిని, విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడే వేషధారణలో డిగ్రీ పట్టాలను స్వీకరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు,విదార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ మహిళా పోలీసులతో సమావేశం

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని గ్రామ మహిళా పోలీసులతో మంగళగిరి రూరల్ ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జరిగే చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి, రౌడీ షీటర్ల కదలికల గురించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని సూచించారు. వ్యాపారం నిర్వహించేవారు, నివాసదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు.

జననేతకు అడుగడుగునా నీరాజనం

- జోరువానలో జగనన్న కోసం వేచి చూసిన పార్టీ శ్రేణులు
- నినాదాలతో హోరెత్తిన జాతీయ రహదారి
- దారి పొడవునా వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఏటుకూరు వద్ద అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

గుంటూరు రూరల్: జననేత వైఎస్ జగన్‌కు అడుగడుగునా వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు నీరాజనం పలికారు. వినుకొండలో టీడీపీకి చెందిన వ్యక్తి చేతిలో దారుణంగా బలైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎన్‌హెచ్ 16 మీదుగా వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఏటుకూరులోని ప్రత్తిపాడు నియోజకవర్గం పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గం ఇన్‌ఛార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా పార్టీ శ్రేణులు హైవేపైకి జోరువానలోనూ తరలి వచ్చాయి. బుడంపాడు మీదుగా ఏటుకూరు, చౌడవరం, ప్రత్తిపాడు మండలాల మీదుగా వెళుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు భారీ మద్దతు తెలిపాయి. వానను సైతం లెక్క చేయకుండా వేలాదిగా జగనన్న వెంట తరలి వెళ్లారు. ఏటుకూరు బైపాస్ వద్ద వేచి చూస్తున్న పార్టీ శ్రేణులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారు నుంచి బయటకు వచ్చి అభివాదం చేశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం 'జై జగన్, జైజై జగన్, జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలతో హోరెత్తింది. జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ఏటుకూరును దాటిన అనంతరం పోలీసులు వెనుక వస్తున్న పార్టీ శ్రేణుల వాహనాలను నిలిపివేశారు.

భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

పెదకాకాని: టీడీపీ దుండగుల చేతిలో అతి కిరాతకంగా బలైన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వినుకొండ బయలుదేరిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా సంఘీభావం తెలిపారు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌ఛార్జి అంబటి మురళీకృష్ణ, స్థానిక నాయకులతో కలిసి కాజ టోల్‌గేట్ వద్ద వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాన్వాయ్ వెంట సాగారు. అలానే గుంటూరు తూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జి షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పెదకాకాని వై జంక్షన్‌కు చేరుకుని అధినేత కాన్వాయ్‌కి స్వాగతం పలికారు. జోరు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వైఎస్ జగన్ రాకకోసం అందరూ వేచి చూశారు. అక్కడికి చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. ఆ ప్రాంతానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. కాన్వాయ్ వెంట ఉన్న పలు వాహనాలను పెదకాకాని వై జంక్షన్ వద్ద బ్యారికేడ్లు అడ్డుపెట్టి నిలిపేయడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 30 నిమిషాల తరువాత వాహనాలను అనుమతించారు. ఇన్‌ఛార్జుల వెంట జాతీయ రహదారిపైకి చేరుకుని అధినేతకు స్వాగతం పలికిన వారిలో పార్టీ నాయకులు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, నాయకులు గోళ్ళ జోసఫ్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ గోచిపాత శ్రీనివాస్, ఉయ్యూరు సతీష్‌రెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి, ఆలపాటి రాఘవ, కొండమడుగు శ్రీనివాసరెడ్డి, తోట శ్రీను, సయ్యద్ సుభాని, సుధాకర్ తదితరులు ఉన్నారు.

జోరువానలోనూ అదే అభిమానం

ప్రత్తిపాడు: జోరువానలోనూ జననేత వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు హైవేపై బారులు తీరారు. ప్రజలు జాతీయ రహదారిపై గంటల తరబడి నిరీక్షించారు. ఉదయం పది గంటలకు జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ వెళుతుందన్న సమాచారంతో మండల పరిధిలోని ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల వద్ద జనం తరలివచ్చారు. కాన్వాయ్ దగ్గరకు రాగానే రోడ్డుపైకి దూసుకొచ్చేందుకు కొన్నిచోట్ల కార్యకర్తలు ఉత్సాహం చూపినప్పటికీ పోలీసులు వారిని నియంత్రించారు. దీంతో హైవే పొడవునా జై జగన్.. జైజై జగన్ నినాదాలు హోరెత్తాయి.



పెదకాకాని వై జంక్షన్‌లో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



జగన్‌ను అనుసరిస్తున్న వాహనాలను పోలీసులు నిలిపివేయడంతో ట్రాఫిక్ జాం దృశ్యం

'కార్డు' దూరం.. 'కౌలు' భారం!

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై నీలినీడలు
- లక్ష్యానికి ఆమడ దూరంలో రెండు శాఖల అధికారులు
- కార్డులు ఇవ్వకుంటే అన్నదాతలకు తీవ్ర నష్టం

కౌలు రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. అవకాశాన్ని ఇచ్చినట్టే ఇచ్చి వారికి ప్రయోజనం దక్కని రీతిలో కార్డుల జారీ ప్రక్రియను నత్తనడకన అమలు చేస్తోంది. కౌలు రైతులను ఆదుకునేందుకు ల్యాండ్ లైసెన్స్‌డ్, కల్టివేటర్స్ ఆర్డినెన్స్–2011 చట్టం ఉన్నప్పటికీ వారికి మేలు చేకూరే పరిస్థితులు క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. ఫలితంగా ఈ ఏడాది కౌలు కార్డుల లక్ష్యం కొండంత ఉన్నప్పటికీ, మంజూరు మాత్రం గోరంతే ఉంది. ఈ ఏడాది కౌలు చేసే అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితులు కనిపిస్తున్నాయి.


పత్తిపాడు: నియోజకవర్గంలో 12,744 కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటికీ ఇరవై శాతం కూడా లక్ష్యాన్ని చేరుకోలేని పరిస్థితి ఉంది. ఈ కార్డుల వల్ల కౌలు కర్షకులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వం అందజేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రాయితీపై విత్తనాలు, ఈ - క్రాప్ బుకింగ్, ఎరువులు, బీమా, ప్రకృతి విపత్తుల సమయంలో పరిహారం, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వం అందజేసే యంత్ర పరికరాలు.. ఇలా అనేక రకాల లబ్ధి కౌలుదారుకు చేకూరుతుంది. ఇంతటి ఉపయోగకరమైన కార్డుల జారీలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గంలో అధికశాతం మంది రైతులు పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తారు. వీటికి ఎకరాకు రూ.లక్షకుపైగానే పెట్టుబడులు అవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో కౌలు కార్డులు లేకుంటే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందని పరిస్థితి తలెత్తుతుంది. అదే జరిగితే కౌలు రైతు కోలుకోవడం చాలా కష్టం.

అవగాహన కార్యక్రమాలు అంతంతే..

యజమానుల నుంచి భూములను కౌలుకు తీసుకుని రైతులు సాగు చేస్తారు. భూమిపై వీరికి హక్కు లేకుండా కేవలం పండించే పంటపై మాత్రమే హక్కు కల్పిస్తూ ఈ కార్డును మంజూరు చేస్తున్నారు. దీనికి భూ యజమాని అంగీకారం తప్పనిసరి. అయితే యజమానులు అపోహలతో ముందుకు రాని పరిస్థితి ఉంది. దీంతో ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు గ్రామస్థాయిలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలు అక్కడి రైతులకు, భూ యజమానులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. కానీ రెవెన్యూ, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో సాగాల్సిన ఈ కార్యక్రమాలు మొక్కుబడిగా ముగిశాయి. దీంతో కౌలు రైతులకు మొండి చేయి తప్పడం లేదు.



ఇటీవల ప్రత్తిపాడు మండలంలో నిర్వహించిన అవగాహన సమావేశం (ఫైల్)



కౌలు రైతులకు మంజూరు చేస్తున్న సీసీఆర్‌సీ కార్డు

నియోజకవర్గంలో మండలాలవారీగా పరిస్థితి ఇదీ...

మండలం	లక్ష్యం	మంజూరైన కార్డులు
ప్రత్తిపాడు	1,497	197
పెదనందిపాడు	3,534	475
కాకుమాను	3,200	1,180
వట్టిచెరుకూరు	2,000	201
గుంటూరు రూరల్	2,513	376
మొత్తం	12,744	2,429

రైతులకు అవగాహన కల్పించాం

గ్రామాల్లోని వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ కొందరు భూ యజమానులు అపోహలతో ముందుకు రావడం లేదు. కౌలు రైతుకు కార్డు ఇచ్చేది కేవలం పంట కాలానికి మాత్రమే. ఈ మేరకు తరచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి చైతన్యపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కార్డుల జారీలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నాం.

– అరుణకుమారి, ఏవో, ప్రత్తిపాడు

విద్యార్థులకు మూడు భాషలు నేర్పాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ



యనమదల (ప్రత్తిపాడు): పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి మూడు భాషలూ కచ్చితంగా నేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ సూచించారు. మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం డీఈవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజనం) మెనూ అమలు తీరు, భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో మాట్లాడటం, రాయడం, చదవడం నేర్పించాలన్నారు. విద్యాభ్యాసం పూర్తి అయ్యేలోగా వాటిపై పూర్తి పట్టు సాధించే దిశగా తర్ఫీదు ఇవ్వాలని పేర్కొన్నారు. పరస్పర ఆరోపణలు మాని అందరి బాధ్యతగా భావించి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థుల విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆమె వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరం



ఈదులపాలెంలో అవగాహన ర్యాలీ చేస్తున్న డాక్టర్ మేరి యునిస్, ఆరోగ్య సిబ్బంది

ఈదులపాలెం (ప్రత్తిపాడు): శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే వైద్యులను సంప్రదించాలని, కుష్ఠు వ్యాధిపై అప్రమత్తత అవసరమని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి రోగులను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని ఈదులపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ మేరి యునిస్ స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ఈ వ్యాధి వంశపారంపర్యం కాదన్నారు. చికిత్సతోనే నయం అవుతుందని చెప్పారు. మచ్చలే కదా అని నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. అంగవైకల్యానికి కూడా దారితీసే అవకాశం ఉందని చెప్పారు. తుమ్మడం, దగ్గడం వల్ల వ్యాధికారకాలు వ్యాప్తి చెందుతాయని, లక్షణాలు కనిపించేందుకు ఐదు నుంచి ఏడు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలుంటే వైద్యులు, గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను సంప్రదించాలన్నారు. ర్యాలీలో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎం వి.అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



ముగ్గురు యువకుల అరెస్ట్ చూపిస్తున్న సీఐ వినోద్ కుమార్

తాడేపల్లిరూరల్: గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో విక్రయదారులు తమ రూట్ మార్చి పోలీసుల కళ్లుగప్పి పలు ప్రాంతాల్లో నిల్వచేసి వాటిని పోలీసులు ఏమార్పుగా ఉన్న సమయంలో బయటకు తీసుకువచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమానం వచ్చిన మంగళగిరి టౌన్ పోలీసులు ముగ్గురు యువకులపై నిఘా ఏర్పాటు చేయడంతో నిర్మానుష్య స్థలాల్లో భద్రపరిచిన గంజాయిని బయటకు తీస్తూ ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. మంగళగిరి టౌన్ సీఐ వినోద్‌కుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నార్త్ జోన్ డీఎస్పీ సిహెచ్.రవికాంత్ ఆదేశాల మేరకు మంగళగిరి రూరల్ యర్రబాలేనికి చెందిన మాకిన అమర్‌నాథ్, కామినేని సాయికృష్ణ, చింతల హరీష్ మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో గంజాయి అమ్ముతున్నారని సమాచారం రావడంతో వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారిని రెండు మూడు సార్లు ఆపి ప్రశ్నించినా వారి వద్ద ఎటువంటి మత్తు పదార్థాలు గాని, సమాచారం గానీ లభించలేదని, వారు తీసుకువచ్చిన గంజాయిని ఎయిమ్స్ హాస్పిటల్ కొండ ప్రాంతంలో భద్రపరిచినట్లు సమాచారం మేరకు వారిని వెంబడించడంతో వారు భద్రపరిచిన గంజాయిని బయటకు తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వీరు విశాఖపట్నం నుంచి అరకు వెళ్లి అరకులో బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి గంజాయి ఎవరి కంటా పడకుండా మంగళగిరి తీసుకువచ్చి చిన్నచిన్న పొట్లాలుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు అంగీకరించినట్లు చెప్పారు. ఈ ఘటనపై మధ్యవర్తుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ వినోద్ కుమార్ వివరించారు.

తల్లీబిడ్డ వివరాల నమోదుపై శిక్షణ

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీలో యూవిన్ యాప్‌లో గర్భిణులు, తల్లీబిడ్డ వివరాల నమోదుపై ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ రోషన్ మాట్లాడుతూ ఆర్‌సీహెచ్ పోర్టల్ తరువాత యూవిన్ యాప్‌లో గర్భిణులు గురించిన పూర్తి సమాచారం, వారికి వేసిన వ్యాక్సిన్లు, ఆరోగ్యవివరాలు, హెచ్‌పీ, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పూర్తి సమాచారం ఆరోగ్య సిబ్బంది నమోదు చేయాలని చెప్పారు. దానితో పుట్టిన బిడ్డకు వేసిన టీకాలు, బిడ్డ ఆరోగ్య స్థితిగతులు గురించిన సమాచారం దీనిలో నమోదు చేయాలని కోరారు. దీని ద్వారా తల్లి యొక్క ఆధార్ నమోదు చేసినట్లయితే వారి పూర్తి సమాచారం లభిస్తుందని చెప్పారు. వ్యాక్సిన్ గురించి అవసరమైన పూర్తి సమాచారంతో కూడిన సర్టిఫికెట్‌లను అందజేసేందుకు వీలుగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యానీగ్రేస్, సీహెచ్ఓ వెంకటలక్ష్మి, ఎంపీహెచ్ఎస్ అబ్దుల్‌రెహమాన్, హెచ్‌వీ నూర్‌ఖాజాబీ తదితరులు పాల్గొన్నారు.

గొడవర్రులో జలజీవన్ మిషన్ బృందం పర్యటన



అవగాహన కల్పిస్తున్న బృంద సభ్యులు

గొడవర్రు(చేబ్రోలు): చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామ పంచాయతీ పరిధిలో జలజీవన్ మిషన్ కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు, నీటి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు నీటిని సరఫరా చేసే విధానాన్ని సభ్యులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం, బడులు, ఇంటింటికీ వెళ్లి నీటిని సేకరించారు. అక్కడే పరీక్షించారు. నీటి శుభ్రతా ప్రమాణాల్లో పాటించాల్సిన అంశాలపై ప్రజలకు సూచనలు చేశారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.కిరణ్‌కుమార్, కో ఆర్డినేటర్ తేజ్ సంగీత్, ఇన్వెస్టిగేటర్ ఎస్.సుజాత, గ్రామ సర్పంచి బీరం జానకీదేవి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి



చేబ్రోలు: క్వారీ గుంతలో పడి వ్యక్తి మరణించిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని క్వారీ గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. చేబ్రోలు పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాళ్లూరి దేవదానం (52) మూడు రోజుల నుంచి కనిపించటం లేదని వారి కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులు పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి దేవదానం అని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు ఎస్ఐ పి. మహేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని నిడమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విజయ్ పికిల్స్, బిత్రా సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్‌పాస్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి బస్‌పాస్‌కు చెల్లించాల్సిన రూ.60 దాతలు 250 మంది విద్యార్థులు చెల్లించి ఉచితంగా అందజేశారని తెలిపారు. విజయ పికిల్స్ యజమాని కాత్రు రాము, బస్‌స్టేషన్ డెప్యూటీ సూపరింటెండెంట్ నాయక్‌లు విద్యార్థులకు బస్‌పాస్‌లు అందించారని అన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ నాయక్ మాట్లాడుతూ పేద విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని, విద్యార్థులు హైస్కూల్‌కు వచ్చేటప్పుడు వారికి ప్రయాణ భారం పడకూడదని ప్రభుత్వ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించిందన్నారు.విద్యార్థులు పాస్‌లకు చెల్లించాల్సిన నగదును దాతలు చెల్లించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీఈటీ ఎస్.రవి, ఆర్టీసీ సిబ్బంది జీవీఎస్, మన్యం, కొండవీటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.